హెచ్‌సీయూలో ఎన్నికలకు ఏర్పాట్లు

రాయదుర్గం: హెచ్‌సీయూలో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఎన్నికలకు నామినేషన్లను దాఖలు చేయడానికి గురు, శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు అవకాశం కల్పిస్తారు. నామినేషన్ల పరిశీలనను కూడా శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. నామినేసన్ల ఉపసంహరణకు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవకాశం కల్పించారు. పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను శనివారం ఉదయం 10 గంటలకు ప్రకటిస్తారు. ఎన్నికల ప్రచారాన్ని ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించారు.

విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని కొండాపూర్‌ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు హఫీజ్‌పేట్‌ ఫీడర్‌ పరిధిలోని హనుమాన్‌నగర్‌, భిక్షపతినగర్‌, గోపాల్‌రెడ్డినగర్‌లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

తెలంగాణను ఇన్నోవేషన్‌ హబ్‌గా తీర్చిదిద్దుతాం

రాయదుర్గం: ఒత్తిడి, ఆందోళన తదితర మానసిక సమస్యలకు పరిష్కారం చూపించగల సామర్థ్యం టెక్నాలజీకి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ క్యాంపస్‌లో బుధవారం సైబర్‌ హోప్‌ హెల్ప్‌ ఇనీషియేటివ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో రూపొందించిన ఏఐ ఆధారిత మెంటర్‌ హెల్త్‌ సపోర్ట్‌ సిస్టమ్‌ 'హోప్‌ ఐ'ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇన్నోవేషన్‌ హబ్‌గా తీర్చిదిద్దాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని ఆ దిశగా దృష్టి సారించి ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీహబ్‌ సీఈఓ కవికృత్‌, సైబర్‌ హోప్‌ హెల్ప్‌ ఇనీషియేటివ్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

గొందళి సమాజ్‌ను బీసీ జాబితాలో చేర్చాలి



బీసీ కమిషన్‌ చైర్మన్‌కు నివేదిక అందజేస్తున్న ఏక్‌నాథ్‌ దుస్గే తదితరులు

ఆల్విన్‌కాలనీ: గొందళి సమాజ్‌ను బీసీ జాబితాలో చేర్చాలని గొందళి సమాజ్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్‌నాథ్‌ దుస్గే కోరారు. ఈ మేరకు సమాజ్‌ సమగ్ర నివేదికను బీసీ కమిషన్‌ చైర్మన్‌ గోపిశెట్టి నిరంజన్‌కు బుధవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్‌ కార్యాలయంలో సంఘం సభ్యుల పూర్తి వివరాల నివేదిక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనేక సంవత్సరాలుగా తాము బీసీ జాబితాలో చేర్చాలని బీఆర్‌ఎస్‌ పాలనలో అనేక విజ్ఞప్తులు అందజేశామన్నారు. అయినా పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో సందీప్‌, సంజయ్‌, దత్తురావు, అనిల్‌, అశోక్‌, దయానంద్‌, సంజయ్‌, అనిల్‌ కర్వన్‌, మారుతి రావు, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌ కమిషనర్‌తో సమావేశం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ను బుధవారం వివిధ అభివృద్ధి పనులపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌, కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు చర్చించారు. అదే విధంగా రాబోయే బతుకమ్మ, దసరా పండుగలకు కావాల్సిన ఏర్పాటు చేయాలని కోరారు. వినాయక చవితి నిమజ్జనానికి సకల సౌకర్యాలతో శాంతియుతంగా జరిగినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం డివిజన్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. వసంత్‌నగర్‌, 5వ ఫేజ్‌, 6వ ఫేజ్‌లలో పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం వార్డు కార్యాలయంలో మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పదేళ్ల కాలంలో కేసీఆర్‌ సారథ్యంలో ఎమ్మెల్యే కృష్ణారావు నాయకత్వంలో డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తి అయ్యాయని, పెండింగ్‌లో ఉన్న పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

నత్తనడకన పనులు.. రోడ్డంతా గుంతలు



అసంపూర్తిగా శ్రీదేవి థియేటర్‌ నుంచి అమీన్‌పూర్‌ వరకు వెళ్లే రహదారి పనులు



రోడ్డుపై గుంతలు ఏర్పడి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్‌ మీదుగా అమీన్‌పూర్‌ కమాన్‌ వరకు రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలల గడుస్తున్నా పనుల్లో వేగం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహదారులు వాపోతున్నారు. జాతీయ రహదారి మొదలుకొని శ్రీదేవి థియేటర్‌ మీదుగా అమీన్‌పూర్‌ వరకు రోడ్డంతా పూర్తిగా గుంతలుగా మారింది. రూ.45 కోట్లతో చందానగర్‌ ఎన్‌హెచ్‌ 65 నుంచి శ్రీదేవి థియేటర్‌ మీదుగా అమీన్‌పూర్‌ వరకు 2.7 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులను మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. 6 నెలలలో పూర్తి చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయేలా ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. –చందానగర్‌



గుంతలతో ఓ వైపు ఒరిగిన లారీ



రోడ్డుపై అడ్డుగా వేసిన మట్టికుప్పలు

ప్రయోజనాలను ఉపయోగించుకోవాలి




సీఆర్‌ రావు జయంతి వేడుకలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

రాయదుర్గం: దేశ జనాభా ప్రయోజనాలను ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ బాలకిష్టారెడ్డి కోరారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్‌ సీఆర్‌ రావు జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టం, రాజ్యాంగం, డబ్ల్యూటీఓ గురించి లోతైన అవగాహన అవసరమన్నారు. ఆర్టిఫీషియల్‌ ఇంటెలీజెన్స్‌, బ్లాక్‌చేయిన్‌ ద్వారా నడిచే ప్రస్తుత జ్ఞాన విప్లవానికి సాంకేతికత చారిత్రక పరిణామాన్ని గుర్తించాలన్నారు. అభివృద్ధి చెందిన, జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి విద్యా సంస్కరణలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ పోటీతత్వం కోసం ప్రతిభను పెంపొందించేందుకు తెలంగాణ సామర్థ్యాన్ని మరింతగా పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్నామని అందుకోసం చేసే కృషికి అందరూ సహకరించాలన్నారు.

ఏసీఎం–ఐసీపీసీ వరల్డ్‌ ఫైనల్స్‌లో సత్తా

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ విద్యార్థుల బృందం ఏసీఎం–ఐసీపీసీ వరల్డ్‌ ఫైనల్స్‌లో సత్తా చాటింది. ఆరు లేదా అంత కన్నా ఎక్కువ ప్రోగ్రామింగ్‌ సమస్యలను పరిష్క రించినందుకు ఆనర్స్‌ జాబితాలో ట్రిపుల్‌ఐటీ బృందానికి స్థానం పొందడం విశేషం.ట్రిపుల్‌ఐటీ ముగ్గురు విద్యార్థుల బృందం లో హువావే–ప్రాయోజిత చాలెంజ్‌లో ప్రపంచ వ్యాప్తంగా 11వ ర్యాంక్‌ను సాధించి టాప్‌–సీడ్‌ సెయింట్‌ పీటర్స్‌బర్గ్‌ స్టేట్‌ యూనివర్సిటీ కన్నా ముందు టాప్‌స్పీడ్‌ స్థానంతో నిల్వడంతో ప్రొఫెసర్లు విద్యార్థుల బృందాన్ని అభినందించారు. ఇటీవల ముగిసిన 2025 ఐసీపీసీ వరల్డ్‌ ఫైనల్స్‌లో శివన్‌సిన్హా, హరిఆకాష్‌,ఉమాసుధన్‌తో కూడిన బృందం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ పోటీలో పాల్గొని సత్తా చాటింది. 103 దేశాల నుంచి 73,083 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ప్రపంచ పోటీలో 3,424 విశ్వవిద్యాలయాల నుంచి ఎంపిక చేయబడిన 140 జట్ల సృజనాత్మకత జట్టు కృషి, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరీక్షించారు. ఆగష్టు 31, సెప్టెంబర్‌ 5 మధ్య జరిగిన ఐసీపీసీ వేదికలలో ఆర్‌ జహా హదీద్‌చే భవిష్యత్‌గా రూపొందించబడిన హేదర్‌ అలీయేవ్‌ సెంటర్‌ బాకు కన్వెన్షన్‌ సెంటర్‌, బాకు ఎక్స్‌పో సెంటర్‌ వంటి మూడు ఐకానిక్‌ ఆర్కిటెక్చరల్‌ అద్భుతాలలో నిర్వహించారు.



'హానర్స్‌' జాబితాలో చోటు దక్కించుకున్న విద్యార్థులు

మౌలిక వసతుల సమగ్రాభివృద్ధికి కృషి

ఎంపీ రఘునందన్‌రావు,ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



రిజర్వాయర్‌ ప్రారంభోత్సవంలో రఘునందన్‌, మహిపాల్‌ రెడ్డి, అంజిరెడ్డి తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మౌలిక వసతుల సమగ్రాభివృద్ధిలో భాగంగా ప్రతీ ఇంటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంతో తమ వంతు కృషి చేస్తున్నామని ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన తాగునీటి రిజర్వాయర్‌, సంపును ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నూతనంగా నిర్మించిన రిజర్వాయర్‌ ద్వారా సుమారు 50పైగా కాలనీలోని ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరు అందుతుందన్నారు. మహానగరంగా విస్తరిస్తున్న తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని అన్ని కాలనీలలో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ అజయ్‌ కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ రాములుగౌడ్‌, మాజీ కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, నాగరాజు, శ్రీశైలం, వివిధ పార్టీల నాయకులు శ్యాంరావు, నర్సింహ, శ్రీపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌, నరేందర్‌రెడ్డి, నర్సింగ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

మియాపూర్‌: రోజుల తరబడి కాలనీల్లోని రోడ్లపై మురుగు పరుగుతో ఇబ్బందులు పడుతున్నామని పలు కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధి లక్ష్మీనగర్‌, న్యూ కాలనీలో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగి రోడ్డుపై ప్రవహిస్తుంది. రోజుల తరబడి మురుగు పారుతున్నా పట్టించుకునే నాథులు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి పైపులైన్లలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించకపోవడంతో మ్యాన్‌హోల్లు పొంగి దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్గంధంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లక్ష్మీనగర్‌ కాలనీ రోడ్డుపై పారుతున్న మురుగు



న్యూ కాలనీలో ఇలా..

దివంగత నేతల విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

జిన్నారం (పటాన్‌చెరు): స్థానిక మండలాభివృద్ధికి విశేష కృషి చేసిన దివంగత నాయకులు మాజీ ఎమ్మెల్యే చిలుముల విట్టల్‌ రెడ్డి విగ్రహంతో పాటు మండల మాజీ ప్రజా పరిషత్‌ అధ్యక్షుడు పడకంటి వెంకటేశం గుప్తా విగ్రహాల ఏర్పాటుకు గ్రామస్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఇద్దరు నేతల ఏర్పాటును స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట గ్రామస్తులు సంయుక్తంగా భూమి పూజ చేశారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

పటాన్‌చెరు: ఇస్నాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారంలో గీతం స్కూల్‌ ఆఫ్‌ హ్యుమానిటీస్‌ అండ్‌ సోషల్‌ సైన్సెస్‌లోని సైకాలజీ విభాగం ఆత్మహత్యల నివారణ, అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ మేరకు ఆత్మహత్యపై దృక్పథాన్ని మార్చడంపై వాల్‌పోస్టర్‌ రూపకల్పన, నినాదాల తయారీ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆత్మహత్యల నివారణపై డాక్టర్‌ కున్మున్‌ ఆతిథ్య అవగాహన కల్పించారు.

అవగాహన సదస్సు

జిన్నారం (పటాన్‌చెరు): మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించి వెంటనే నిపుణుల సలహా తీసుకోవాలని సైక్రియాటిస్ట్‌ డాక్టర్‌ మధు మోహన్‌ అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్య వైజ్ఞానిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

సత్యసాయి ట్రస్ట్‌ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: సత్య సాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో సమాజ అభివృద్ధికి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శాంతినగర్‌ కాలనీలో ఉన్న సత్య సాయి బాబా మందిరంలో గురు పూర్ణిమ పురస్కరించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు. నవంబర్‌లో జరగనున్న సత్య సాయిబాబా గురుపూర్ణిమ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని నియోజకవర్గం నుంచి 30వేల మంది భక్తులు తరలి వెళ్తున్నారన్నారు. వీరికి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి సత్యసాయి బాబా చేసిన సేవలు ప్రపంచవ్యాప్తంగా పేరు పొందాయని తెలిపారు. ఈ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రత్యేక నీటి ట్యాంకులు నిర్మించి మంచినీటిని అందించినట్లు గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో సత్య సాయిబాబా మందిరాలు నిర్మాణాలకు భూమిని సైతం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్‌ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్‌ రెడ్డి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌, సత్యసాయి బాబా సేవా సమితి బాధ్యులు రామి రెడ్డి, వెంకటేష్‌, శంకర్‌, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ రావు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలో సంప్రద మల్టీక్యూజిన్‌ రెస్టారెంట్‌ను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఎంపీ మాట్లాడుతూ ఆహారపు అలవాట్లను మార్చుకున్నానని, పిజ్జాలు, బర్గర్‌లు మానేశానని తెలిపారు. అమ్మమ్మ ప్రేమగా వండిన అనుభూతి కల్గించే సంప్రదాయ తెలుగు వంటకాలను వడ్డిస్తామని నిర్వాహకులు నాగ భరత్‌ కుమార్‌ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు గంగాధర్‌ రెడ్డి, రాగం నాగేందర్‌ యాదవ్‌, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చింపుల సత్యనారాయణ, పంచాయితీరాజ్‌ గౌరవ అధ్యక్షుడు పసునూరి నరేంద్ర పాల్గొన్నారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్‌ ర్యాంకింగ్స్‌ పడిపోవడంపై ఏబీవీపీ నిరసన



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ నేషనల్‌ ఇనిస్టిట్యూషనల్‌ ర్యాంకింగ్‌ ఫ్రేమ్‌వర్క్‌ (ఎన్‌ఐఆర్‌ఎఫ్‌)లో భారీగా ర్యాంకింగ్‌ పడిపోవడంపై ఏబీవీపీ–హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హెచ్‌సీయూ క్యాంపస్‌లోని సౌత్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌ వద్ద ఏబీవీపీ నాయకులు నిరసన తెలిపారు. యూనివర్సిటీ ర్యాంకింగ్‌ గతంలో కన్నా గణనీయంగా పడిపోతున్నా పాలకమండలి, విద్యార్థి సంఘం పట్టీపట్టనట్లు వ్యవహరించడం అన్యాయమంటూ నినాదాలు చేశారు. యూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు మరింతగా తీసుకొచ్చేందుకు యత్నించాల్సింది పోయి ఇలా ర్యాంకింగ్స్‌లో పడిపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనీల్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి ఆయుష్‌కుమార్‌ మాట్లాడుతూ.. హెచ్‌సీయూకు ఎన్‌ఐఆర్‌ఎఫ్‌ ర్యాంకింగ్స్‌లో 2021లో ఓవరాల్‌గా 17వస్థానం, యూనివర్శిటీ పరంగా 9వ స్థానంలో ఉండేదని, 2022లో 20, 10 స్థానాల్లోకి, 2023లో అదే స్థానాలను నిలబెట్టుకున్నారని, 2024లో 25, 17వ ర్యాంకుకు పడిపోయారని, 2025లో ఓవరాల్‌గా 26వ స్థానం, యూనివర్శిటీ కేటగిరిలో 18వ స్థానానికి పడిపోవడం బాధాకరమన్నారు. అధికార యంత్రాంగం, పాలకమండలి స్పందించి భవిష్యత్‌లో ర్యాంకింగ్‌ మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం రద్దు

పరిపాలనాభవనం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం 2024–25 పాలకమండలిని రద్దు చేస్తూ అధికారయంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా కొత్తగా ఎన్నికల కమిషన్‌ను నియమిస్తూ ఆదేశాలివ్వడంతో బుధవారం వివాదం తలెత్తింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘం ప్రతినిధులు, పలు విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతుతో నిరసన తెలిపారు. పరిపాలనా భవనం ముందున్న మెట్లపై కూర్చొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యూనివర్సిటీ అధికారులు తీసుకున్న నిర్ణయం రాజ్యాగానికి విరుద్ధమన్నారు. అధికారుల నిర్ణయం యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని దీన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్‌ చేశారు.

అర్హులకే జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టులు ఇవ్వాలి

రాయదుర్గం: సెక్రటేరియట్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టులు కేవలం అర్హులైన వారికే ఇవ్వాలని ఆల్‌ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివయాదవ్‌ డిమాండ్‌ చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022లో అప్పటి ప్రభుత్వ కాలంలో ప్రధాన కార్యదర్శిగా ఉండే సోమేష్‌కుమార్‌ సమయంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌ ద్వారా 42 బ్యాక్‌లాగ్‌ జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టులు ఉన్నాయని అయితే ఈ పోస్టులను అర్హతలేని కొంత మందికి అక్రమంగా ఇవ్వాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంత మందిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అర్హులైన అభ్యర్థుల హక్కులను ఎవరూ హరించలేరని, ఎంపికలు కేవలం అర్హతల ఆధారంగా జరగాలన్నారు. బ్యాక్‌లాగ్‌ పోస్టులు సామాజిక న్యాయం కోసం ఉద్దేశించబడినవని, వాటిని ఇతర ప్రయోజనాల కోసం వాడుకోవడం అన్యాయమన్నారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగితే విద్యార్థి సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

అంతర్జాతీయ క్రీడలు, ఈవెంట్లకు హబ్‌గా హైదరాబాద్‌




పోస్టర్‌ ఆవిష్కరణలో అతిథులు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో డిసెంబర్‌ 6,7 తేదీలలో బైక్‌ రేసింగ్‌ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ నగరం జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు, ఈవెంట్లకు హబ్‌గా మారుతుందన్నారు. ప్రతిష్ఠాత్మకంగా ఐఎస్‌ఆర్‌ఎల్‌ బైక్‌ రేసింగ్‌ పోటీలు నిర్వహించేందుకు హైదరాబాద్‌ నగరాన్ని ఎంపిక చేయడం పట్ల అభినందనీయమన్నారు. మోటార్‌ స్పోర్ట్స్‌ అంటే ఆసక్తి చూపే యువత, విద్యార్థులు ఈ పోటీలను చూసేందుకు భారీగా దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి తరలి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడలకు కాంగ్రెస్‌ ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఐఎస్‌ఆర్‌ఎల్‌ వ్యవస్థాపకులు ఈషాన్‌ లోఖండే మాట్లాడుతూ.. తెలంగాణ స్పోర్ట్స్‌ అథారిటీ సహకారంతో గచ్చి బౌలి స్టేడియంలో రెండు రోజులపాటు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలను తిలకించేందుకు సినీ నటుడు సల్మాన్‌ఖాన్‌, ఇతర సినీ ప్రముఖులు కూడా రానున్నారని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో బిగ్‌రాక్స్‌ మోటార్‌ స్పోర్ట్స్‌ యజమాని గౌతమ్‌రెడ్డి, తెలంగాణ ఒలంపిక్‌ అసోసియేషన్‌ కోశాధికారి సతీష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం.. ఐలమ్మ పోరాటం



ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌



చాకలి ఐలమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శేరిలింగంపల్లి: చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు కొనియాడారు. చందానగర్‌ డివిజన్‌ శివాజీనగర్‌లో తెలంగాణ ఈశ్వర రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ హాజరై ఐలమ్మ చిత్రపటానికి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలకు స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరేశం గౌడ్‌, రవియాదవ్‌, గోపాల్‌ యాదవ్‌, రాములు, పరుశరాములు, ప్రతాప్‌, భీమేష్‌, తెలంగాణ ఈశ్వర రజక సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శేలింగంపల్లిలో..

లింగంపల్లి విలేజ్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ, సీపీఎంల సంయుక్తా ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగంపల్లిలోని గాంధీ విగ్రహం వద్ద ఐలమ్మ చిత్రపటానికి నివాళుర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కొంగరి కృష్ణ, జగదీష్‌ మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటానికి చాకలి ఐలమ్మ నాంది పలికారన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి విలేజ్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ నాయకులు దేవులపల్లి శ్రీనివాస్‌, మల్లేష్‌ గౌడ్‌, బాలేష్‌, సాయి, డాక్టర్‌ మీనా, సీపీఎం సీనియర్‌ నాయకులు మాణిక్యం పాల్గొన్నారు.